

చౌడాపూర్ మండల కేంద్రంలో అనుమతి లేని క్లీనిక్‌ను సీజ్ చేస్తున్న జిల్లా వైద్యాధికారులు(ఫైల్)

నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, శుక్రవారం 20 సెప్టెంబర్ 2024 | RANGAREDDY

# లేబుళ్లు.. వివరాలు లేవు

## 'అలివ్'లో ఫుడ్ సేఫ్టీ తనిఖీలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ ) : ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించని వ్యాపారస్తులపై ఫుడ్ సేఫ్టీ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. రుచికి, శుభ్రతకు పెట్టింది పేరు అంటూ ఊదరగొట్టే పెద్ద పెద్ద పేరు మోసిన హోటళ్లు, రెస్టారెంట్లు, బార్ల బండారాలు బయటపడుతున్నాయి. గురువారం ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని పలు షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ప్రముఖ అలివ్ మిఠాయి షాపులో నమ్‌కీన్, మిక్చర్, చకోడి తదితర ప్యాకెట్లపై లేబుళ్లు సరిగ్గా లేవని, లైసెన్స్ నంబరు, లోగో, తయారీదారుల వివరాలు లేవని గుర్తించారు. జీబీ పాన్ ప్లేస్‌లో డస్ట్ బిన్లకు సరైన మూతలు లేవని, ఫుడ్ హ్యాండర్లకు హెయిర్‌క్యాప్, గ్లౌవ్స్ లేవని గుర్తించారు. రత్నదీప్ రిటైల్ మార్కెట్‌లో చీజ్‌లు, బ్లూ బెర్రీస్ ప్యాకెట్లు ఇతర వాటికి లేబుల్స్ సరిగా లేనట్లు గుర్తించి.. నోటీసులు జారీ చేశారు.

# వచ్చిరాని వైద్యం..
# ప్రాణాలతో చెలగాటం

- అనుమతి లేకుండానే క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వహణ
- అన్ని వ్యాధులకు ఒకే విధమైన చికిత్స
- డెంగీ, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు
- ప్రజల నుంచి పెద్ద మొత్తంలో దండుకుంటున్న ప్రైవేట్ వైద్యులు
- చౌడాపూర్ మండలంలో జిల్లా అధికారుల దాడులతో బయటపడ్డ విషయాలు

కులకచర్ల, సెప్టెంబర్ 19 : అసలే వర్షాకాలం.. పంచాయతీల్లో పరిసరాలు కంపు.. కంపుగా ఉండడంతో దోమలు ప్రబలి..ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. స్థాని కంగా ఉన్న ప్రైవేట్ వైద్యుల వద్దకు వెళ్తే.. వచ్చిరాని వైద్యంతో వారు రోగుల ప్రాణా లతో చెలగాటం ఆడుతున్నారు. ఎలాంటి అనుమతుల్లేకుండా సంపాదనే ధ్యేయంగా వెలుస్తున్న క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

### సంపాదనే ధ్యేయంగా..

సీజనల్ వ్యాధులు ప్రబలడంతో గ్రామాల్లోని ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. ప్రభుత్వ దవాఖానలు దూరంగా ఉండడంతో రోగులు స్థానికంగా ఉన్న ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. సంపాదనే ధ్యేయంగా ఎలాంటి అనుమతుల్లేకుండా వెలుస్తున్న క్లినిక్‌లు, ల్యాబ్‌లకెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారు. టెన్త్ కూడా పాస్ కాని వారు కొంతమంది రాజకీయనాయకుల అండదండలతో క్లినిక్‌లను ఏర్పాటు చేసి వైద్యులుగా చెలామణి అవుతున్నారు. అన్ని వ్యాధులకు ఒకే విధమైన చికిత్స చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మండలంతోపాటు చౌడాపూర్ మండల కేంద్రంలో కొందరు ఎలాంటి అనుమతుల్లేకుండా క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఆర్‌ఎంపీ వైద్యులు ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను నిర్వహించాలంటే వైద్యశాఖ నుంచి అనుమతి పత్రాలు తీసుకోవాలి. వైద్యానికి వచ్చిన వారికి తగిన సూచనలు మాత్రమే ఇవ్వాలి. కానీ, ఆర్‌ఎంపీ వైద్యులు మాత్రం తమకు ఇష్టం వచ్చినట్లు సీనియర్ వైద్యులుగా వ్యవహరిస్తూ అన్ని రోగాలకు మందులు రాస్తున్నారు. డయాగ్నోస్టిక్ సెంటర్ల ఏర్పాటుతోపాటు వారే సొంతంగా మెడికల్ షాపులను నిర్వహిస్తూ పేదల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నారు. జ్వరం, టైఫాయిడ్, డెంగీ, మలేరియా, చికున్‌గున్యాలతో పాటు అనేక రకాల వ్యాధులకు సంబంధించిన టెస్టులు కూడా చేస్తున్నారు.

జ్వరం వచ్చిందని ప్రైవేట్ క్లినిక్‌లకు వెళ్తే మినిమం రూ. రెండు నుంచి రూ. మూడు వేల వరకు ప్రజల నుంచి దండుకుంటున్నారు. ఎలాంటి అనుభవం, అర్హత లేకుండా డయాగ్నోస్టిక్ సెంటర్లను కొనసాగిస్తున్నారు. చౌడాపూర్ మండల కేంద్రంలోని ఓ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ఇంటర్ చదువుతున్న విద్యార్థి నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఎవరైనా ప్రశ్నిస్తే వారిని రాజకీయనాయకుల అండదండలతో బెదిరిస్తున్నారు. కాగా కొందరు హెల్త్‌అసిస్టెంట్లు కూడా ప్రైవేట్ క్లినిక్‌లను ఏర్పాటు చేసుకొని వైద్యం అందిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

### అధికారుల దాడులు.. క్లినిక్‌ల సీజ్

డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు బుధవారం చౌడాపూర్ మండల కేంద్రంలో జిల్లా అధికారులు పలు క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లపై దాడులు చేసి సీజ్ చేశారు. వాటిలో ఎస్‌కే, మదిహా డయాగ్నోస్టిక్ సెంటర్లు, మదిహా క్లినిక్, రాజ్యలక్ష్మి ఫస్ట్ ఎయిడ్ సెంటర్, షిఫ క్లినిక్‌లున్నాయి. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో పాల్వన్‌కుమార్ మాట్లాడుతూ అనుమతి లేకుండా క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### చౌడాపూర్‌లో ఐదు క్లినిక్‌ల సీజ్

చౌడాపూర్ మండలంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఐదు క్లినిక్‌లు, డయా గ్నోస్టిక్ సెంటర్లను అధికారులు సీజ్ చేశారు. ప్రాథమిక చికిత్స నిర్వహించాల్సిన ఆర్‌ఎంపీలు అన్ని రకాల వైద్యం అందిస్తున్నారని అధికారులకు అందిన ఫిర్యాదుల మేరకు వారు దాడులు చేసి వాటిని సీజ్ చేశారు.

– డాక్టర్ వాజిహుద్దీన్,
కులకచర్ల మండల వైద్యాధికారి




చేవెళ్లలో బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు

*రుణమాఫీ చేయకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బాధిత రైతాంగం పోరుకు సిద్ధమైంది. ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు చలో ప్రజాభవన్ కార్యక్రమానికి రైతులు పిలుపునిచ్చారు. వీరి పోరుకు బీఆర్ఎస్ శ్రేణులు మద్దతు పలికి గురువారం ప్రజాభవన్‌కు వెళ్లేందుకు బయలు దేరారు. పోలీసులు ఎక్కడికక్కడ నేతలను నిర్బంధించారు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేట, కొందుర్గు, చౌదరిగూడ మండల కేంద్రాలు, కొత్తూరు, షాద్‌నగర్, నందిగామ, ఆమనగల్లు, చేవెళ్లలలో బీఆర్ఎస్ శ్రేణులను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. అదేవిధంగా వికారాబాద్ జిల్లాలోని పరిగిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. గురువారం తెల్లవారుజాము నుంచే ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ నేతల అరెస్టుల పరంపర కొనసాగింది. రుణమాఫీపై మాట తప్పిన కాంగ్రెస్‌ను నిలదీయడానికి వెళ్తున్న నేతలను అరెస్టు చేయడం సరైంది కాదని వివిధ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.*

*– రంగారెడ్డి, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ)*

# రుణమాఫీ.. రణం

### చలో ప్రజాభవన్‌కు పిలుపునిచ్చిన బాధిత రైతాంగం

- మద్దతుగా నిలిచిన బీఆర్ఎస్ పార్టీ
- ప్రజాభవన్‌కు బయలుదేరిన జిల్లా నేతలను ఎక్కడికక్కడ అరెస్టు చేసిన పోలీసులు
- ప్రభుత్వ చర్యలపై మండిపడుతున్న బీఆర్ఎస్ శ్రేణులు, ఉమ్మడి జిల్లా రైతాంగం

### నేటికీ అసంపూర్ణమే..

వానకాలం ముగుస్తున్నది. రైతు భరోసా ఊసే లేదు. పంట రుణాలు సైతం చాలామందికి ఇంకా మాఫీ కాలేదు. ప్రభుత్వం చేపట్టిన సర్వే ఇంకా కొనసా..గుతున్నది. దీంతో రుణమాఫీకి ఇంకెంత కాలం వేచి చూడాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో మొదటి విడుతలో 49,471 మందికి రూ.257.19కోట్ల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. రెండో విడుతలో 22,915 మంది రైతులకు సంబంధించిన రూ.218.13 కోట్లను, మూడో విడుతలో 15,226 మంది రైతులకు రూ.185.40 కోట్ల రుణాలను మాఫీ చేసినట్లు ప్రభుత్వం చెబుతున్నది. మూడు విడుతల్లో కలిసి జిల్లాలో 87,612 మందికి రూ.660.72కోట్లను మాఫీ చేసింది. రుణమాఫీ కాని రైతుల్లో చాలా మందికి రేషన్ కార్డులేక మాఫీ కాలేదు. ఈ మేరకు బాధిత రైతుల నుంచి అధికారులకు 17,926 దరఖాస్తులు రాగా.. ఇంటింటికీ వెళ్లి పరిశీలిస్తున్నారు. ఇప్పటికీ దరఖాస్తుల పరిశీలన కొనసాగుతూనే ఉన్నది. కేవలం కుటుంబ నిర్ధారణకు సంబంధించిన దరఖాస్తులను మాత్రమే వ్యవసాయ అధికారులు పరిశీలిస్తున్నారు. ఆధార్ మిస్ మ్యాచింగ్, ఇతరత్రా పొరపాట్లు ఉన్నవి బ్యాంకులు చూసుకుంటాయని చెబుతున్నారు. దీంతో రైతులు మళ్లీ వ్యవసాయ అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఇదిలా ఉండగా.. రూ.2లక్షలకు పైగా రుణాలు తీసుకున్న రైతుల విషయంలోనూ ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు. ప్రభుత్వ లోటుపాట్లు వేలాది మంది రైతుల పాలిట శాపంగా మారాయి. రుణమాఫీ అయిన తర్వాతే కొత్త రుణాలు ఇస్తామంటూ బ్యాంకర్లు స్పష్టం చేస్తుండడంతో పంటల సాగుకు డబ్బుల్లేక జిల్లా రైతాంగం గోస పడుతున్నది. ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పంటలను సాగు చేస్తున్నారు. రుణమాఫీపై ప్రభుత్వం మాటతప్పగా.. ఇదేమిటని ప్రశ్నిస్తే అరెస్టులు, నిర్బంధాలకు పూనుకోవడం ఎంతవరకు సబబు అని ఉమ్మడి జిల్లా రైతాంగం ప్రశ్నిస్తున్నది.




కులకచర్లలో బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేసిన పోలీసులు

# కుట్టు కూలీ..
# ఇయ్యాలే..



**ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫామ్‌లు కుట్టిచ్చిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు కుట్టు కూలీ డబ్బులు ఇంకా విడుదల కాలేదు. ఇప్పటివరకు ఒక్క జత యూనిఫామ్‌కు సంబంధించిన రూ.50 మాత్రమే సర్కారు చెల్లించింది. రెండో విడతకు సంబంధించి స్పష్టత లోపించింది. దాదాపుగా రూ.72.45 లక్షలు రావాల్సి ఉండగా వాటి కోసం స్వయం సహాయక సంఘాల సభ్యులు డీఆర్‌డీఏ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.**

- రెండు యూనిఫామ్‌లకు రూ.75 చొప్పన చెల్లిస్తామని వెల్లడి
- వికారాబాద్ జిల్లాలో ఒక్క జతకు మాత్రమే ఎస్‌హెచ్‌జీలకు రూ.50 చొప్పన కుట్టు కూలీ అందజేత
- నాలుగు నెలలు దాటినా మిగతా చెల్లింపుపై స్పష్టత నివ్వని ప్రభుత్వం
- రావాల్సిన మొత్తం రూ.72.45 లక్షలు
- డీఆర్‌డీఏ కార్యాలయం చుట్టూ ఎస్‌హెచ్‌జీల ప్రదక్షిణ
- రెండు జతల యూనిఫామ్‌కు నిధులిచ్చామని సీఎం ప్రకటనపై మండిపాటు
- జిల్లాలో 96,600 మంది విద్యార్థులు

వికారాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు అన్యాయం చేస్తున్నది. పెట్టుబడి సాయం అందించకుండా రైతులను అప్పులపాలు చేసిన సర్కారు.. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫామ్‌లు కుట్టిచ్చిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్య(ఎస్‌హెచ్‌జీ)లకు సైతం మొండిచేయి చూపుతున్నది. విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్ కుట్టిచ్చిన ఎస్‌హెచ్‌జీలకు నిధులిచ్చామని సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం నూతన ఇండస్ట్రీ పాలసీ కార్యక్రమంలో ప్రకటించారు. అయితే నాలుగు నెలలైనా ఇప్పటి వరకు వారికి పూర్తి మొత్తంలో నిధులు చెల్లించలేదన్నది వాస్తవం. బాధ్యతాయుత పదవిలో ఉన్న సీఎం అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. జిల్లాలోని 1042 ప్రభుత్వ పాఠశాలల్లోని 96,600 మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్‌ను కుట్టించాలని.. ఇందుకు ఒక్కో జతకు రూ.75 చొప్పున చెల్లిస్తామని ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీలకు తెలిపింది. అయితే యూనిఫామ్‌లు కుట్టిచ్చి నాలుగు నెలలు గడిచినా ఇప్పటివరకు కేవలం ఒక్క జత యూనిఫామ్‌కు రూ.50 మాత్రమే చెల్లించింది. మిగిలిన రూ.72.45 లక్షల కోసం స్వయం సహాయక సంఘాల సభ్యులు డీఆర్‌డీఏ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కాగా తాండూరు మండలంలో రెండో జత యూనిఫామ్ విద్యార్థులకు ఇంకా పంపిణీ చేయాల్సి ఉన్నది.

### రెండో జతకు రూపాయీ విదల్చలే..

విద్యార్థుల యూనిఫామ్‌లు కుట్టిచ్చిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు కుట్టు కూలీ చెల్లించడంలో సర్కారు తీవ్ర జాప్యం చేస్తున్నది. మొదటి జత యూనిఫామ్‌కు సంబంధించి కేవలం రూ.50 అందజేసిన విద్యాశాఖ.. మిగతా రూ.25లపై చేతులెత్తేసింది. మిగిలిన డబ్బులూ విద్యాశాఖ ద్వారానే వస్తాయని డీఆర్‌డీఏ అధికారులు చెబుతుండగా, సెర్ప్ ద్వారా వస్తాయని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఏ శాఖ నుంచి నిధులు వస్తాయో తెలియక ఎస్‌హెచ్‌జీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీఎం రెండు జతల యూనిఫామ్‌కు సంబంధించి ఎస్‌హెచ్‌జీలకు డబ్బులిచ్చామని చెప్పడం అబద్ధమని పలువురు పేర్కొంటున్నారు.

### రెండో జత డబ్బులు రాలేదు..



రెండో జత యూనిఫామ్‌కు సంబంధించి ఎస్‌హెచ్‌జీలకు కుట్టు కూలీ డబ్బులు ఇంకా ప్రభుత్వం నుంచి రాలేదు. ఒక్కో జతకు రూ.75 చొప్పున ఇవ్వాల్సి ఉన్నది. అయితే మొదటి జత యూనిఫామ్‌కు రూ.50 చొప్పున ఎస్‌హెచ్‌జీలకు డీఆర్‌డీఏ ద్వారా అందజేశాం. మిగతా రూ.25 సెర్ప్ ద్వారా అందిస్తాం. ఇప్పటివరకు జిల్లాలో 97 శాతం విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్‌ను అందజేశాం. ఒక్క తాండూరు మండలంలో మాత్రమే పెండింగ్ ఉంది త్వరలోనే పంపిణీ చేస్తాం.

– రేణుకాదేవి, డీఈవో వికారాబాద్

### నిధులను పెండింగ్‌లో పెట్టొద్దు..



రెండో జత యూనిఫామ్ కుట్టిన డబ్బులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి. ఆ నిధులను పెండింగ్‌లో పెట్టడం తగదు. వేల రూపాయలు పెట్టి కుట్టుయంత్రాలను కొనుగోలు చేసి డ్రెస్సులు కుట్టాం. సర్కారు డబ్బులు చెల్లిస్తే మా అప్పులు తీరుతాయి.

– వసీమా, మర్పల్లి

### జతకు రూ.150 ఇవ్వాలి



ప్రభుత్వం విద్యార్థుల యూనిఫామ్ జతకు రూ.150 చెల్లించాలి. కానీ, రెండు జతలకు కలిపి రూ.75 ఇస్తుండడంతో పెరిగిన ధరలకు గిట్టుబాటు కావడం లేదు. సర్కార్ మొదటి జత కుట్టిన డబ్బులు చెల్లించి.. రెండు జతవి చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టడం సరికాదు.

– గౌరమ్మ పంచలింగాల్,
మర్పల్లి

### అధికారులు స్పందించాలి



ప్రభుత్వం యూనిఫామ్ కుట్టేందుకు ఒక జతకు 75 రూపాయలు చెల్లించాలని నిర్ణయించింది... కానీ మొదటి జతకు ప్రస్తుతం 50 రూపాయలు మాత్రమే వచ్చాయని అధికారులు చెబుతున్నారు. ఒక యూనిఫామ్‌కు 75 రూపాయలు చెల్లించాలి. యూనిఫామ్ కుట్టడానికి మా కష్టం చాలా ఉన్నది. అధికారులు స్పందించి పూర్తి డబ్బులు వచ్చేలా చూడాలి.

– లక్ష్మి, అంతారం,
కులకచర్ల మండలం

### గిట్టుబాటు కావడం లేదు..



విద్యార్థుల యూనిఫామ్ కుట్టే పనిని మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్ప గించడం ద్వారా ఉపాధి లభిస్తున్నది. కానీ ప్రభుత్వం ఇస్తున్న కూలీ మాత్రం గిట్టుబాటు కావడం లేదు. బయట ఒక యూనిఫామ్ కుట్టాలంటే రూ.300 వరకు తీసుకుంటున్నారు. అన్ని ధరలూ పెరిగాయి. ప్రభుత్వం మాత్రం రెండు జతలకు కలిపి రూ.75 చెల్లిస్తున్నది.. ఆ మొత్తాన్ని పెంచితే బాగుంటుంది.

– కావలి చరిత, కుట్టు కేంద్రం నిర్వాహకురాలు,
తుంకిమెట్ల

### కుట్టు కూలీ పెంచాలి



విద్యార్థుల యూనిఫామ్ కుట్టేందుకు ప్రభుత్వం చెల్లిస్తున్న రూ.50 ఏ మాత్రం సరిపోవడం లేదు. పెంచిన కూలీ ప్రకారం జతకు రూ.75 ఇవ్వాలి. కాజాలు, గుండీలు కుట్టిన వారికి ఇంకా డబ్బులు ఇవ్వాలి. పెంచిన కూలీ ఇస్తే అందరికీ ఉపయోగంగా ఉంటుంది.

– గౌసియాబేగం, కొత్తూరు

### రెండు జతలకు డబ్బులు ఇయ్యలే..



కుట్టిన రెండు జతలకు ప్రభుత్వం డబ్బులు ఇయ్యలె. యూనిఫామ్ కుట్టిన వెంటనే డబ్బులు చెల్లిస్తామని చెప్పారు. కాని ఇప్పటివరకు డబ్బులు మంజూరు కాలేదు. అధికారులు మొదటి యూనిఫామ్‌కు డబ్బులు చెల్లించడంతో పాటు రెండో యూనిఫామ్‌కు కూడా డబ్బులు చెల్లించాలి.

– నీలమ్మ, బండవెల్కిచర్ల, కులకచర్ల మండలం

## డ్రగ్స్ అమ్ముతూ పట్టుబడిన ఇంజినీరింగ్ విద్యార్థులు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులు దారి తప్పారు.. వ్యసనాలకు అలవాటుపడి.. డ్రగ్స్ అమ్మడం మొదలుపెట్టారు...ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడి కటకటాలపాలయ్యారు. ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు మరో ముగ్గురు అరెస్టయ్యారు. నిందితుల వద్ద నుంచి రూ.1.53 లక్షల విలువ చేసే 30 ఎల్‌ఎస్‌డీ బ్లాస్ట్‌లు, 5.77 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ తిరుపతి యాదవ్ కథనం ప్రకారం.. మాదాపూర్‌కు చెందిన దత్తిలితిన్, పడాల అభిరామ్ నాయుడు, కొడాలి సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో డ్రగ్స్ విక్రయించాలని నిర్ణయించుకున్నారు. బెంగళూరు కేంద్రంగా గుర్తుతెలియని వ్యక్తి వద్ద నుంచి డ్రగ్స్‌ను కొనుగోలు చేసి, నగరంలో అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ తిరుపతి తన బృందంతో కలిసి మాదాపూర్ అయ్యప్ప సొసైటీ ప్రాంతంలో డ్రగ్స్ విక్రయించేందుకు యత్నిస్తున్న దత్తిలితిన్, అభిరామ్, కొడాలిలను అరెస్టు చేశారు.

### వ్యసనాలకు అలవాటుపడి..

వ్యసనాలకు అలవాటుపడి డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులను హైదరాబాద్ డీటీఎఫ్ అధికారులు పట్టుకున్నారు. డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శిరీష కథనం ప్రకారం.. చరణ్ తేజ్, కౌశిక్ తూబోటి, సయ్యద్ సర్ఫరాజ్ చెన్నైలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. వ్యసనాలకు అలవాటు పడిన వీరు.. డబ్బుల కోసం డ్రగ్స్ విక్రయిస్తున్నారు. చెన్నై నుంచి డ్రగ్స్ సరఫరా చేస్తున్న అరుణ్‌రాజ్ ద్వారా సరుకు కొనుగోలు చేసి, నగరంలో అమ్ముతున్నారు.

సమాచారం అందుకున్న డీటీఎఫ్ బృందం గురువారం జూబ్లీహిల్స్ మాదాపూర్ రోడ్‌నం.37లో డ్రగ్స్ విక్రయించేందుకు యత్నిస్తుండగా ముగ్గురు విద్యార్థులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నది.

## మూసీ వెంబడి నిర్మాణాలపై సర్కారు దృష్టి

### కూల్చివేతలపై అక్టోబర్ నెలాఖరులో తుది నిర్ణయం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 19(నమస్తే తెలంగాణ) : మూసీ వెంబడి నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా ఉండేందుకు నిర్మాణాల కూల్చివేతలపై కసరత్తు చేస్తున్నది. ఇప్పటికే మహానగరంలో విస్తరించి ఉన్న 55 కిలోమీటర్ల వెంబడి, ఇరువైపులా ఉన్న నిర్మాణాలపై మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు ఇరిగేషన్, రెవెన్యూ, ఇతర శాఖల సమన్వయంతో సర్వే చేయగా, ఇప్పటివరకు 13వేలకు పైగా నిర్మాణాలు ఉన్నట్లుగా గుర్తించారు. లండన్‌లోని థేమ్స్ తరహాలో మూసీని లక్షన్నర కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుండగా... ఈ నిర్మాణాల విషయంలో ఏం చేయబోతున్నారనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది. అయితే ప్రభుత్వం మాత్రం ముందుకు సంబంధిత నిర్మాణ యజమానులకు నోటీసులు ఇచ్చేందుకు కసరత్తు మొదలుపెట్టినట్లు తెలిసింది. నోటీసుల్లోనే సంబంధిత నిర్మాణం వివరాలను ఎందుకు కూల్చొకూడదు అనే విషయంపై వివరణ ఇచ్చే విధంగా ఫార్మాట్‌ను సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం మూసీ వెంబడి ఉన్న నిర్మాణాలను అక్రమ, సక్రమమా? అనే విషయాన్ని తెలుసుకునేందుకు ఇప్పటికే ఓ దఫా ఎంఆర్‌డీసీఎల్ అధికారులు ప్రాథమిక సర్వే చేశారు. ఈ సర్వే సమయంలోనే నిర్మాణం పూర్తి వివరాలను ప్రత్యేకంగా తయారు చేసిన యాప్‌లో పొందుపరిచినట్లు తెలిసింది. ఇప్పుడు నోటీసుల ద్వారా సేకరించే వివరాల ప్రకారం కూల్చివేతలు ఎలా చేపట్టాలి ? పునరావాసం, పరిహారం ఏ విధంగా చెల్లించాలనే విషయాలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ముందుగా నోటీసులు జారీ చేసిన వెంటనే నేరుగా కూల్చివేతలు చేపట్టాలనే ఎంఆర్‌డీసీఎల్ అధికారులను ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆదేశించినట్లు తెలిసింది. కానీ నేరుగా కూల్చివేతలతో న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉందని భావించింది. ఈ క్రమంలోనే ముందుగా నోటీసులిచ్చి... అక్టోబర్ నెలాఖరులోగా కూల్చివేతలపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.